


# ముళ్ళదారి

అలపర్తి రామకృష్ణ

దుక్కి దున్నాటం పూర్తి చేసి అరకకు కట్టిన దున్నపోతులను అదిలించుకుంటూ ఇంటి మొహం పట్టాడు నాగయ్య.

అప్పటికే పొద్దు వాలిపోయింది.

కాలువ గట్ల మీద మేత మేసి, కాలువలో దిగి ఒళ్లంత తడుపుకుని హుషారుగా ఊళ్ళోకి పరుగులు తీస్తున్నాయి పశువులు.

రోడ్డు మీద గోల చేస్తూ ఆడుకుంటున్న పిల్లలను 'దున్నపోతులు బెదిరి పొడుస్తా యంటూ', గదమాయించాడు నాగయ్య. అతని మాటలు లెక్కచేయకుండా దున్నపోతుల మీద మట్టి బెడ్డలు విసరడం మొదలు పెట్టారు పిల్లలు.

ఊళ్ళో అందరికీ అత నంటే సదభిప్రాయమే ఉంది. "మనిషి సాధు జంతువు. ఎవరి జోలికి వెళ్ళడు. తన పనేదో తాను చూసుకోవడం తప్పితే పరుషంగా ఎవ్వరినీ ఒక్క మాట అనడు" అంటారు అందరూ ఈ వానాకాలం వానలు ఎక్కువ కురుస్తాయనో, ఇంటి ముం దున్న కొబ్బరి చెట్లుకు యాభై కాయలు దాకా కాస్తాయనో, ఎకరానికి ఎన్ని బస్తాల ధాన్యం అవుతుందో - అనే విషయాలపై చుట్టుప్రక్కల వాళ్ళతో మాటా మాటా పెంచుకుంటాడు గాని రాజకీయాల రొచ్చు లోకి, కుల మతాల కంపులోకి తల దూర్చడు.

కామయ్యగారి పాలేరు ఎదురొచ్చేడు.

"రాత్రికి శివాలయం దగ్గర మన సర్పంచ్‌గోరు మీటింగు ఎట్టారు... అన్నాలు తినేసి అందరినీ

రమ్మన్నారు''

"ఎందుకురా?'' పాలేరును అడిగాడు నాగయ్య.

"మ నూళ్ళో దొంగల భయం ఎక్కువయిందిగా... దాన్ని గూర్చి మాట్లాడటానికి''

"దండోరా వేసి ఊళ్ళో అందరికి చెప్పట్లేదా?''

"అందరిని మీటింగుకు పిలవట్లేదు... ఊళ్ళో పెద్ద రైతు లందరికి చెప్పమన్నారు''

"నా కుంది రెండెకరాల మాగాణీ... నేనేం పెద్ద రైతునురా!''

"అది నాకు తెలీదండీ... అయ్యగారు మీ క్కూడా సెప్పమన్నారు. చెప్పేశాను'' విసుగ్గా అంటూ వెళ్ళిపోయాడు పాలేరు.

తనను పెద్ద రై తన్నందుకు సంతోషంతో ఊగిపోయాడు నాగయ్య ఓ క్షణం. మరో క్షణంలో డబ్బు ల్లేక సరైన వైద్యం చేయించలేకపోవడంతో చనిపోయిన భార్య గుర్తుకు వచ్చి క్రుంగిపోయాడు. తను బక్క చిక్కిన రైతు.

పదేళ్ళ నుంచి దెబ్బ మీద దెబ్బ తగులుతూనే ఉం దతనికి

క్షయ రోగంతో భార్య చనిపోయింది.

ప్రమాదవశాత్తు ఎడ్ల బండి క్రింద పడి పెద్ద కొడుకు చనిపోయాడు.

ఉన్న రెండెకరాల మాగాణి మీద వచ్చే అరకొర ఆదాయంతో బ్రతుకు బండి నడపడం కష్టంగానే ఉంది. పాతిక వేలు అప్పు చేసి, పెద్ద రైతుల దగ్గర నిమ్మ, సపోటా తోటలు గుత్తకు తీసుకుంటే ఫలసాయం అందే తరుణంలో తుపాను రావడంతో తోట లన్నీ నేలమట్టం అయ్యాయి.

ఎన్నోసార్లు కుప్ప మీదున్న సార్వా, దాళ్వా పంటల్లు నీళ్ళ పాలయ్యాయి. దొరికిన చోటల్లా అప్పులు చేసి మళ్ళీ దున్ని నారుమళ్ళు సిద్ధం చేసేవాడు.

ఏరువాక సమయంలో పూజలు చేసి నాగలి పట్టడం, పంట చేతి కొచ్చే సమయానికి వరద లొచ్చో, తుపా నొచ్చో, మురుగు కాలవలు పొంగో ధాన్య లక్ష్మిని నీళ్లపాలు చెయ్యడం జరుగుతూనే ఉంది.

నాగయ్య పరిస్థితి అతలాకుతలం అయ్యింది.

పాత అప్పులు తీర్చమని ఊళ్ళో షావుకార్లు, బ్యాంకు అధికారులు ఇంటి మీద ముట్టడి చేస్తున్నారు. కొత్తగా అప్పులు పుట్టడం లేదు.

ఇంటికి చేరుకుని వేడి నీళ్ళు ఒంటి మీద గుమ్మరించుకుని ఆరుబయట కుక్కి మంచం మీద పడుకుంటే గాని నాగయ్యకి ప్రాణం తేరుకోలేదు.

"శివాలయం దగ్గర మీటింగు ఉందటగా... నే వెళ్ళొస్తా!'' అన్నాడు నాగయ్య చిన్న కొడుకు రవి.

కొడుకు మాటలకు ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"ను వ్వొద్దులే... నీ దసలే దూకుడు వ్యవహారం. కొంప మీదకు ఏదో ఒకటి తీసుకొస్తావ్! నేనే వెళ్ళి వస్తాను'' అనేసి వంటింట్లోకి వెళ్ళాడు.

రవికి పాతికే ళ్ళుంటాయి. బి.ఎ వరకు చదివాడు. సర్పంచ్‌ను పట్టుకుని పట్నంలో ఏదో ఒక ఉద్యోగంలో కుదర్చాలని నాగయ్య తాపత్రయం.

ఉద్యోగం చెయ్యడం రవికి ఇష్టం లేదు. రైతు కూలీల కోసం పాటుపడా లంటా డతను. పొలం పను లంటే అతనికి ఆసక్తి. కొడుకు ధోరణి నచ్చక, ఏదో ఒక ఉద్యోగంలో పడేసి, పెళ్ళి చేసేస్తే వాడే కుదురుగా ఉంటాడని నాగయ్య ఆలోచన.

వేడి అన్నంలో మామిడికాయ పచ్చడి కలుపుకుని నాలుగు ముద్దలు తిని, ఓ గ్లాసు మజ్జిగ త్రాగి ఇంట్లో నుంచి బయట కొచ్చాడు నాగయ్య.

ఊళ్ళో రైతు లంతా శివాలయం దగ్గర చేరారు.

అందరి దృష్టి ఎత్తైన అరుగు మీద కూర్చుని చుట్ట కాలుస్తున్న సర్పంచ్ కామయ్య మీదే ఉంది.

వెన్నెట్లో తెల్లని బట్టల్లో మెరిసిపోతూ దేవతామూర్తిలా కామయ్య ఊళ్ళో వాళ్ళకి కన్పించాడు.

అతని మాట ఊళ్ళో వా ళ్ళందరికి వేదవాక్కులా మొన్నిమధ్య వరకూ నడిచింది. అతనికి పోటీగా పెద్ద కామందు రంగయ్య రంగం మీదకు రావడం ఊళ్ళో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. రంగయ్య మనుషులు ఓ పది మంది హతమయ్యారు. కామయ్య వర్గం వాళ్ళు మరో పది మంది హత్యకు గురయ్యారు. పండగల ముందు ఆ ఊరికి కొత్త అల్లుళ్ళు వస్తే, పండుగల సందర్భాల్లో జరిగిన కొట్లాటల్లో మరణించిన వారిని చూడటానికి పాత అల్లుళ్ళల్లా పోలీసులు రావడం రివాజు.

రంగయ్య వచ్చే దాకా మీటింగు మొదలు పెట్ట లేదు కామయ్య. అరుగు మీద కామయ్య ప్రక్కనే కూర్చుంటూ.

వాళ్ళిద్దరూ చాలా మర్యాదగా పలకరించుకుంటారు. ఎదు రెదురుగా ఒకరిని మరొకరు పల్లెత్తు మాట అనరు. కొంచెం పక్కకు వెళ్లగానే కారాలు మిరియాలు నూరతారు. నోటికి వచ్చిన తిట్లు తిడతారు పరోక్షంలో

"మన ఊరికి కొత్త బెడద వచ్చి పడింది... మొన్న లక్ష్మయ్య ఇంట్లో జరిగిన దారుణం తెలుసుగా'' అన్నాడు కామయ్య గొంతు సవరించుకుంటూ.

అందరి మనసుల్లో లక్ష్మయ్య ఇంట్లో జరిగిన దారుణం మెదిలింది.

ముఖాలకు ముసుగులు వేసుకుని నిక్కర్లు, బనియన్లు ధరించి పది మంది దోపిడీ దొంగలు లక్ష్మయ్య ఇంటికి వచ్చారు. గొడ్డళ్లతో తలుపులు పగులగొట్టి ఇంట్లోకి వచ్చారు. దొంగల్ని ధైర్యంగా ఎదుర్కొనటానికి ప్రయత్నించిన లక్ష్మయ్య కొడుకు చేతులు నరికేశారు. ఇంట్లో ఉన్న బంగారం, డబ్బు పట్టుకెళ్ళారు.

అంతకు మునుపు ఇటువంటి సంఘటనలే ఆ ఊళ్ళో అయి దారు జరిగాయి. ఊళ్ళో వాళ్ళు చావుకూ బ్రతుక్కీ మధ్య ఊగిసలాడుతున్నారు.

"ఈమధ్య మన ఊళ్ళో జరిగిన బందిపోటు దొంగల దోపిడీల్లో రెండు లక్షల రూపాయల విలువైన బంగారం, వెండి, నగదు పోగొట్టుకున్నాం. మన మంతా కలిసికట్టుగా ఉండి దొంగలను ఎదుర్కొంటే బందిపోటు దొంగలు పలాయనం చిత్తగిస్తారు'' అన్నాడు కామయ్య ఆవేశంగా.

"పోలీసులు ఏం చేస్తున్నట్లో?'' కామయ్య ఉపన్యాసానికి అడ్డు తగులుతూ అన్నాడు రంగయ్య.

"దొంగలు స్వైరవిహారం చేసి వెళ్ళిపోయాక తెల్లవారితే గాని పోలీసులు మన ఊరికి రారు... వాళ్ళు వచ్చాక ప్రశ్నలతో మనల్ని విసిగించి, కోడి కూర తినేసి, మన దగ్గర మామూళ్ళు తీసుకుని తాపీగా వెళ్తారే గాని దొంగలను పట్టుకోవడం జరగదు'' అన్నాడు కామయ్య.

"ఇప్పుడు ఏం చేద్దా మంటావో చెప్పు'' అన్నాడు రంగయ్య విసుగ్గా.


"మనం తుపాకులు కొనుక్కోవాలి!'' అనేశాడు కామయ్య గట్టిగా.

జనంలో కలవరం మొదలయ్యింది.

"మనం తుపాకులు కొనుక్కోవా లంటే ప్రభుత్వం ఒప్పుకోవాలి కదా?'' ఓ రైతు సందేహం వెలిబుచ్చాడు.

"తుపాకులు మన దగ్గర ఉంచుకుందా మంటే పోలీసులు ఊరుకోరు గదా?'' మరో రైతు ప్రశ్నించాడు.

"తుపాకులు పేల్చడానికి మనకు చేతనవుతుందా?''



“ఊళ్ళో బలవంతుల దగ్గర తుపాకులు చేరిపోతే బలహీనుల గతేం గాను” మరో యువకుడు ప్రశ్నించాడు.

మళ్ళీ గొంతు సవరించుకుని స్వరం పెంచాడు కామయ్య.

“నిశ్శబ్దంగా ఉండండి... మీ ప్రశ్న లన్నిటికి నేను సమాధానం చెబుతాను. మన రక్షణ మనమే చూసుకోవాలి. అన్నిటికి ప్రభుత్వం మీద ఆధార పడకూడదు. మన ఇష్టం వచ్చినట్లుగా తుపాకులు కొంటామంటే ప్రభుత్వం ఒప్పుకోదు. సరే... మాకు తుపాకు లొద్దు... దోపిడీ దొంగల నుండి రక్షించండి అని మనం మొరపెట్టుకున్నా ప్రభుత్వం బందిపోటు దొంగలను అణచలేదు... కాబట్టి మనం తుపాకులు కొనుక్కోవడం కంటే మరో మార్గం లేదు... నాటు తుపాకులు తయారు చేసే వాళ్ళు నాకు తెలును. వాళ్ళ దగ్గర తుపాకులు, తూటాలు కొందాం. తుపాకులు పేల్చడం ఎలాగో వాళ్ళే మనకు నేర్పుతారు. పోలీసుల కంటబడకుండా దాచుకుంటే సరి” అన్నాడు కామయ్య.

“మనం కొనబోయే తుపాకులు మీ ఇంట్లో పెట్టుకుంటారా?” ఏదో అనుమానం వచ్చి అడిగాడు రంగయ్య.

“నా దగ్గర వద్దు. నీ దగ్గర వద్దు. నాగయ్య ఇంట్లో ఉంచుదాం. అతను పెద్దమనిషి. ముఠా రాజకీయాల్లోకి అతను తలదూర్చడు” అన్నాడు కామయ్య.

నాగయ్య ఉలిక్కిపడ్డాడు.

“నా దగ్గర తుపాకులు ఉంచకండి. తుపాకు లంటే నాకు భయం” అన్నాడు నాగయ్య కంగారుగా

“నీకేం భయం లేదులే నాగయ్యా! మేం ఉన్నాం కదా! అందరికి నమ్మతమయిన ఓ పాతిక మంది కుర్రాళ్ళకు తుపాకులు పేల్చడంలో తర్ఫీదు ఇప్పిద్దాం. మనకు ఓ యాభై తుపాకు లన్నా కావాలి. అవి కోనాలంటే డబ్బు కావాలి. రెండెకరాలు పొలం ఉన్న రైతు లంతా ఓ వెయ్యి రూపాయల చొప్పున చందా ఇవ్వండి”

నాగయ్య గుండెల్లో రాయి పడింది.

అసలే అప్పుల సుడిగుండంలో గొంతువరకూ మునిగి ఉంటే పైన ఆకాశం నుండి ఈ తుపాకుల జడివాన...

చిర్రెత్తు కొచ్చిం దతనికి.

“ఊరికి బడి కావాలని, గుడి కావాలని, రోడ్డు వేయించాలని అందరూ కోరుకుంటారు గాని తుపాకులు కావాలని ఎవరు అడుగుతారు? ఇప్పటికే మన ఊరు బహిరంగ జైలుగా మారిపోయింది. కుట్ర కేసులు, చిత్రహింసలు, మూకుమ్మడి అరెస్టులూ, పోలీసుల దాడులు పెరిగిపోయాయి. ఊళ్ళో ఎక్కడ చూసినా రక్తం మరకలే! వీటికి తోడు ఇప్పుడు మనం తుపాకులు ఇళ్ళల్లో తెచ్చి పెట్టుకుంటే ఊరు శ్మశానం అవుతుంది” అన్నా డో యువకుడు ఆవేశంగా.

ఆ యువకుడు చెప్పింది సబబుగానే తోచింది నాగయ్యకు. ధైర్యం తెచ్చుకుని గొంతు పెగిల్చాడు.

“చిన్న చిన్న రైతులం మా కెందుకండీ తుపాకులు? దొంగ లొచ్చి ఇంట్లో పడ్డా చిల్లి గవ్వ దొరకదు మా ఇంటిలో”

నాగయ్య మాటలు కామయ్యకి కోపం తెప్పించాయి. తను వేసిన పథకానికి గండి పడుతున్నట్లు గ్రహించాడు.

“ఎవరి దగ్గర డబ్బు ఉందో ఎవరి దగ్గర లేదో బందిపోటు దొంగల కేం తెలుస్తుంది? రేపు నీ ఇంట్లో పడి నీ కొడుకును గొడ్డలితో నరికితే అప్పుడు తెలుస్తుంది తుపాకీ అవసర మేమిటో!” గట్టిగా హూంకరించాడు కామయ్య.

సర్పంచ్ మాటలకు ఒణికి పోయాడు నాగయ్య.

తను బ్రతికేదే కొడుకు కోసం. వెయ్యి రూపాయల కోసం ఊళ్ళో పెద్దలతో విరోధం తెచ్చుకుని కొడుకును బలి పెడతాడా? కామయ్య కోపం తనకు తెలును. తన మాటకు అడ్డొచ్చిన వాడి తల నరకడానికి వెనకాడడు కామయ్య.

ఊళ్ళో పెద్దలు తమ పౌరుషం, పరాక్రం దోపిడీ దొంగల మీద చూపిస్తే ఎంత బావుణ్ణు! మనుషుల్ని నిముషంలో పస పసా నరికివేసే సత్తా ఉన్న వాళ్ళు కలిసి కట్టుగా ఉండి బందిపోటు దొంగలను ఎదుర్కొంటే దొంగల బెడద ఉండదు కదా!

“మీరు అనుకున్నట్లే కానివ్వండి. అప్పు చేసే మీ వెయ్యి రూపాయలు వారం రోజుల్లో తెచ్చి ఇస్తాను” అన్నాడు నాగయ్య తలొంచుకుని.

వెన్నెట్లో విజయయ గర్వంతో మెరిసిపోయేడు కామయ్య పథకం తనకు ఏ విధంగా నష్టం కలిగించ దని అన్ని కోణాల్లో ఆలోచించుకుని తన ఆమోదం తెలిపేడు రంగయ్య.

** **

తుపాకు లొచ్చాయి, తూటాలూ ఒచ్చాయి గ్రామానికి.

తుపాకులు తెచ్చిన వాళ్ళే వాటిని ఎలా ఉపయోగించాలో గ్రామం లోని కుర్రాళ్లకు నేర్పారు. తుపాకులు ఉపయోగించడంలో నాగయ్య కొడుకు రవి బాగా చురుకుదనం చూపించాడు. నాటు బాంబులు తయారు చేసే కిటుకులు కూడా నేర్చుకున్నాడు. గంధకం,. పొటాష్, గాజు పెంకులు కలిపి కాగితాలు, బట్టలతో కలిపి చుట్టు నాటు బాంబులు తయారు చేశాడు రవి. రవి చొరవ, ఉత్సాహం చూసి తుపాకులు తెచ్చిన వాళ్ళు ముక్కు మీద వేలేసుకున్నారు.

శిక్షణ పూర్తయ్యాక తుపాకులు తెచ్చి నాగయ్య ఇంట్లో పాత భోషాణంలో దాచారు.

తుపాకులు ఇంటికి తెచ్చిన దగ్గర నుండి నాగయ్యకి నిద్ర కరువైంది.

భోషాణం వైపు చూడా లంటేనే భయపడుతున్నాడు.

ఊరి కేదో అరిష్టం దాపురించిం దనుకున్నాడు నాగయ్య.

ఊరికి మంచి రోజులు వచ్చాయనుకున్నాడు రవి. భోషాణం చూడగానే అతని మనస్సు ఉప్పొంగుతుంది.

** **

ఎవరో తట్టి లేపడంతో ఉలిక్కిపడి లేచాడు కామేయ్య.

ఎదురుగా ముఖాలకు ఎర్రటి ముసుగులు ధరించి నాటు తుపాకులు పట్టుకున్న యువకులు కన్పించారు. రవి పోలికలతో ఓ యువకుడు కన్పించాడు కామయ్యకి.

కామయ్యను బెదిరించి ఇనప్పెట్టె తాళాలు తీసుకున్నారు. ఇన పెట్టె తెరిచి అందులోని కరెన్సీ నోట్లు, బంగారపు నగలు సంచిలో వేసుకుని ప్రామిసరీ నోట్లు, దస్తావేజులు తగలబెట్టారు. కామయ్య ఇంట్లో దోచిన బంగారం, కరెన్సీ రైతు కూలీల ఇళ్ళ ముందు వెదజల్లి పాటలు పాడుకుంటూ వెళ్ళిపోయారు.

కామయ్య శవం మాత్రం చలనం లేకుండా ప్రామిసరీ నోట్ల ముక్కలు, నెత్తురు మడుగుల మధ్య పడి ఉంది.

** **

రంగయ్య మీసం మెలి వేశాడు కామయ్య చనిపోయా డనే వార్త తెలియగానే.

తను చెప్పినట్లుగానే అడవిలో అన్నలు కామయ్యని అంతం చేశారు. ఊళ్ళో తన మాటకు ఎదురు లేదు.

మరో వార్త అతన్ని ఆలోచనలో పడేసింది.

ఊళ్ళో కుర్రాళ్ళు నలుగు రైదుగురు కన్పించడం లేదట. ఆ వార్త వినగానే రంగయ్యలో కంగారు పుట్టింది.

అనుచరులను వెంటేసుకుని నాగయ్య ఇంటికి పరుగెత్తాడు. ఇంట్లో రవి లేడు. నాగయ్య మాత్రం దిగులుగా కూర్చుని ఉన్నాడు.

భోషాణం ఖాళీగా ఉంది.

తుపాకులు, తూటాలు మాయమయ్యాయి.

కామయ్య గతే తనకూ పడితే?

భయంతో చెమటలు పట్టాయి రంగయ్యకు.

భుజం మీద కండువా సంగతి కూడా మర్చిపోయి పట్నం వెళ్ళి పోలీసులకు రిపోర్టు చేయడానికి నాగయ్య ఇంట్లో నుంచి బయటకు పరుగెత్తాడు రంగయ్య. *

## గుండె జబ్బు కారణాలు

బక్కగా, పీలగా ఉండే వారిలో కంటే స్థూలకాయుల్లోనే ఈ గుండె జబ్బులు అనేకం. వారి శరీరంలోని రక్తంలో చెడు క్రొవ్వు చేరి ఉండడం వల్ల రక్త పోటు రావడానికి, తదనుగుణంగా గుండె వ్యాధులు కలగడానికి ఆస్కారం ఉంటోంది. పొగ పీల్చే వారిలో గుండె జబ్బులతోబాటు కాన్సర్, శ్వాసకోశ వ్యాధులు కూడా సంభవిస్తాయి. అధికంగా తిండి తింటూ శ్రమించకుండా ఉండే వారిలోనూ, మధుమేహ రోగుల్లోనూ, ఎప్పుడూ మానసికంగా టెన్షన్‌తో ఉండేవారిలోనూ గుండె వ్యాధులు అధికంగా వస్తుంటాయి. రక్తంపోటు గలవారిలో గుండెపోటుతోబాటుగా పక్షవాతం కూడా వచ్చే అవకాశం ఉంటోంది. ఈ గుండె వ్యాధులని నిరోధించడానికి ఏకైక మార్గం రోజూ క్రమం తప్పకుండా శరీర వ్యాయామం చేయటమే. అంతేకాక శరీరాన్ని వయసు, ఎత్తుకు తగిన బరువు ఉండేట్లు చూసుకోవడం కూడా అవసరం.

—భోగా శ్రీనివాసమూర్తి [హైదరాబాద్]